

సంక్రాంతికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆర్‌టిసి దూర ప్రాంత ప్రజల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ జిల్లాలో కాకినాడ డిపో నుంచి 31, ఏలేశ్వరం డిపో నుంచి ఆరు, తుని డిపో నుంచి 10 బస్సులను హైదరాబాద్‌కు జనవరి 31 వరకు ఈ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. అలాగే విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు కాకినాడ డిపో నుంచి రోజుకు రెండు సర్వీసులు నడుపుతున్నామన్నారు. పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా సాధారణ ఛార్జీలతోనే బస్ సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు.



తాళ్ళరేవులో ధర్నా చేస్తున్న అఖిల పక్ష నాయకులు

జిఒ1 రద్దు కోరుతూ ఆందోళన

ప్రజాశక్తి - పిఠాపురం:

పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని నిరసన తెలిపారు. అనంతరం జీవో కాపీలను దహనం చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పద్మావతి, రమాదేవి, సిఐటియు నాయకులు కే చిన్న లు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఏ విధమైన ఆందోళన చేయకుండా జీవో నెంబర్ ఒకటిని విడుదల చేయడం దారుణమన్నారు. గతంలో ఉన్నప్పుడు మీరు ఎవరి పర్మిషన్ తీసుకుని పాదయాత్రలు లౌడ్ స్పీకర్లు పెట్టి బహిరంగ సభలో నిర్వహించారని ప్రశ్నించారు.నాడు లేని ఆంక్షలు ఎందుకు ఈ రోజున కార్మికులు ప్రజలపై జీవో ల రూపంలో తీసుకురావడం ప్రజాస్వామ్య విరుద్ధం అని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పనికి తగ్గ వేతనం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.వీరబాబు,ఎం దుర్గా, బి.కరుణ, బి నాగలక్ష్మి, అనంతలక్ష్మి, భువనేశ్వరి, కష్టవేణి, సత్యవాణి పాల్గొన్నారు. **తాళ్ళరేవులో** మండలం అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహశీల్దార్ పోతురాజుకు వినతిపత్రం అందజేశారు. వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి సెక్షన్ 30, 144 నిరంతరం అమలులో ఉంటున్నాయని ఇది సరికాదు అన్నట్లు ప్రశ్నించే గొంతుకులను ప్రజా ఉద్యమాలను ప్రతిపక్షాలను అణచివేయాలని కుట్రతో ఏకపక్షంగా జీవో నెంబర్ వన్ తీసుకొచ్చిందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ జీఓను రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజలను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబురావు, మందాల గంగ సూర్యనారాయణ, వళ్ళు రాజబాబు, ముత్యాల జయలక్ష్మి, టేకుమూడి లక్ష్మణ రావు, ధూళిపూడి బాబి, జక్కల ప్రసాద్ బాబు, దుప్పి అదష్టదీపుడు, ఉంగరాల వెంకటేశ్వరరావు పాలెపు ఈశ్వరరావు, గోడి భాస్కరరావు, మురాల రాజేష్, దాసరి వేణుగోపాల్ పాల్గొన్నారు.



పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట జిఒ1 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

-విద్యార్థి యువజన సంఘాల సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించడం ద్వారానే అభివద్ధి సాధ్యమని పలు పార్టీ నాయకులు అన్నారు. ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగుతున్న సమరయాత్ర బస్సు యాత్రను జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధనకై కాకినాడ రామారావు పేటలోని ఎస్టియు జిల్లా కార్యాలయంలో బుధవార రౌండ్ టేబుల్ సమావేశం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి రాజా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై బాబి అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థి యువ జన సంఘాలు ప్రత్యేక హోదా విభజన హామీల అమలుకై హిందూపురం నుండి శ్రీకాకుళం వరకు జరుగుతున్న సమరయాత్రను (బస్సు యాత్ర) విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

విద్యార్థి, యువజన సంఘాల సమావేశానికి వివిధ రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు తెలియజేశాయి. టిడిపి కాకినాడ నగర అధ్యక్షులు మల్లు పూడి వీరేంద్ర కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి జె.ఆదినారాయణ, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు అయినాపురం సూర్యనారాయణ, ఆర్‌పిఐ సీనియర్ నాయకులు ఏ రామేశ్వర రావు, సిపిఐ ఎంఎల్ జనశక్తి జిల్లా నాయకులు సతీష్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు నరాల శివ, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ కాకినాడ నాలుగో వార్డ్ ఇన్‌చార్జ్ భాస్కర్‌లు మద్దతు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లు కావ స్తున్నా అవుతున్నా ఆంధ్ర రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం ఇస్తానన్న ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఆంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు నినాదంతో ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న ఐదు కోట్ల ప్రజలు రోడ్డు మీదకు వచ్చి బిజెపి ప్రభుత్వాన్ని నిలదీసే అడగాలని పిలుపునిచ్చారు. విద్యార్థి యువజన సంఘాలు చేస్తున్న సమరశీల యాత్రను అన్ని రాజకీయ పార్టీలు వారి వారి జెండాలు పక్కన పెట్టి ప్రత్యేక హోదా జెండా పట్టుకుని విద్యార్థి యువజన సంఘాలతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమౌళి పద్మ, పౌర సంక్షేమ సంఘం నాయకులు సిహెచ్ అజయ్ కుమార్, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల యూనియన్ కాకినాడ పార్లమెంట్ అధ్యక్షులు గదుల సాయిబాబా, దూసర్లపూడి రమణ రాజు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ప్రత్యేక హోదా లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా పరిశ్రమలు విద్యాసంస్థలు ఏమీ రాలేదన్నారు. ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, తెలుగు యువత కాకినాడ పార్లమెంట్ అధ్యక్షులు యనమల శివరామకష్ణ, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కే శ్రీ సూర్య, విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర నాయకులు బుల్లి రాజు, రవితేజ, విద్యార్థి జేఏసీ నాయకులు తిరగాటి పండు, కాకినాడ పార్లమెంట్ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు వనమాడి మోహన్ వర్మ, తెలుగు యువత కాకినాడ నగర అధ్యక్షులు చింతలపూడి రవి కుమార్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మయూరి, పిడిఎస్‌యు కాకినాడ డివిజన్ కార్యదర్శి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజనలో భాగంగా రాష్ట్రంలో 11 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఒక విశ్వవిద్యాలయం కూడా పూర్తి చేయలేదన్నారు. అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేదన్నారు. విజయనగరం గిరిజన యూనివర్సిటీ అద్దె భవనాల్లో క్లాసులు జరుగుతున్నాయన్నారు. కాకినాడలో ఏర్పాటు చేస్తామన్న పెట్రోలియం యూనివర్సిటీ ఎక్కడ ప్రారంభించ లేదన్నారు. బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే విద్యార్థులు, యువకులు చూస్తూ ఊరుకోరని సరైన గుణపాఠం చెబుతామన్నారు. ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగుతున్న సమరయాత్ర బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు పి వరహాలు, జిల్లా కమిటీ సభ్యులు మాధవ్, కాకినాడ నగర అధ్యక్షులు సత్య నగర్ నాయకులు శ్రీనివాసు, కృప, ప్రసాదు డివైఎఫ్ఐ కాకినాడ కన్వీనర్ పాండవుల దుర్గాప్రసాద్ ఏఐవైఎఫ్ నగర నాయకులు నాని, జీవన్ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుకై సమైక్యత ప్రకటిస్తున్న వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి యువజన సంఘాల నాయకులు

ఫొటోగ్రాఫర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - కోటనందూరు

ఫోటోగ్రాఫర్ల అభివద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని పట్టణంలో బుధవారం కాకినాడ జిల్లా నూతన ఫోటోగ్రాఫర్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్య వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన ఆధునిక పరిజ్ఞానంతో పాటుగా ఫొటోగ్రఫీ రంగాన్ని ఫోటోగ్రాఫర్లందరూ ఆధునిక కెమెరాలను కొనుగోలు చేసుకోవడానికి వ్యక్తిగత రుణాలను మంజూరు చేయడానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాకినాడ జిల్లా నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షులుగా ఎండి ముక్తార్, గౌరవ సలహాదారులుగా కొత్త సత్య దత్తు, జిల్లా అధ్యక్షులుగా బచ్చ వీర వెంకట సత్యనారాయణ ప్రధాన కార్యదర్శిగా బి. శ్రీను ,ఉపాధ్యక్షులుగా పప్పు విజయ్, కర్రీ సత్తిబాబు, కోశ అధికారిగా తేటగుంట శ్రీను తోపాటు మరి కొంతమంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేశారు. అనంతరం తుని జోన్ కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు.



కాకినాడ జిల్లా ఫొటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా


తెలుగు సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సంప్రదాయానికి చిరునామా సంక్రాంతి పండగని రూరల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ అన్నారు. తిమ్మాపురం పంచాయతీ కార్యాలయం ఎదురుగా సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన ముగ్గుల పోటీలు క్లాసికల్ డాన్స్ పోటీలలో విజేతలకు కురసాల సత్యనారాయణ, రూరల్ సీఐ శ్రీనివాస్ తిమ్మాపురం ఎస్ఐ నాగరాజు బహుమతులు అందజేశారు. వైస్ ఎంపీపీ బందెల విరిసా సత్తిబాబు, సత్యవతి, ఎంపిటిసి ముద్దన వెంకటరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **ఐడియల్ కళాశాలలో** కాకినాడ విద్యుత్ నగర్ ఐడియల్ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు మేర్ల రంజిత్, వాసు కొప్పిశెట్టి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన పోటీలలో విజేతలకు కాకినాడ సబ్ డివిజన్ డిఎస్‌పి పడాల మురళీకష్ణారెడ్డి బహుమతి ప్రదానం చేశారు. అనంతరం పోటీలలో విజేత లకు, ఇటీవల కాకినాడ బీచ్ మారథాన్ రన్లో 21 కిలోమీటర్స్ రన్‌లో విజేతగా నిలిచిన బిందాన వీరేంద్ర కిరణ్‌కు జ్ఞాపికలు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కొప్పిశెట్టి వాసు డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. **కోటనందూరు** మదర్ విద్యా సంస్థలో ఎస్ఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు ఎంపిపి ఎల్. శ్రీనివాసు నగదు బహుమతితో పాటు షీల్డ్, జ్ఞాపికలను అంద జేశారు. విద్యాసంస్థల చైర్మన్ పెనుముచ్చ నాగేశ్వరరావు, మహేష్, మండల వైస్ ప్రెసిడెంట్లు బంటుపల్లి గంగాధర్, కష్ణ, కోఆప్షన్ సభ్యులు జగటాల కోట సత్తిబాబు పాల్గొన్నారు, **గండేపల్లి** సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో అభినయ సాంస్కతిక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగవల్లుల, ఫ్యాషన్ షో, జానపద నత్యాలు, పాటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి వివిధ పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. డీన్ ఎస్.రమాశ్రీ, జె.డి. వెంకటేష్, సుధారాణి, గ్రంథాలయ అధికారి కె.అశోక్ కుమార్, పర్యావరణ మిత్ర టి.గంగాధర్ పాల్గొన్నారు. **సామర్లకోట** ప్రతిభ విద్యానికేతన పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ జీవివి ప్రకాష్, డైరెక్టర్ టి సుధారాణి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిం చారు. కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా హైకోర్టు ప్రముఖ న్యాయవాది ఎం.శ్రీవిజయ హాజర య్యారు. ప్రధానంగా ఆరవ తరగతి విద్యార్థులు మాస్క్ వాడకంపై జర జాగ్రత్త అనే సందేశాత్మ నాటిక ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. భోగి మంటలు, గంగిరెద్దుల మేళం, హరిదాసు, సోదిమ్మ, ముగ్గుల పోటీలు మొదలగు వేష ధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనం తరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ టి.సునీత, పెద్దాపురం బ్రాంచ్ ప్రిన్సిపాల్ టి.అరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని కోలంక వింగ్స్ పాఠశాల కాజులూరు వినాయక పాఠశాల గొల్లపాలెం కెవిఎన్ పాఠశాలలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు భోగిమంటవేసి, హరిదాస్ వేషధారణ, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు కొల్లు బయ్యేశ్వరరావు, డేగల రాంబాబు, తిరగాటి కిషోర్, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యా యులు విద్యార్థులు పాల్గొన్నారు. **కరప మండలం** పెనుగుదురు సంధ్య ఫీజియోథెరపీ కళాశాలలో బుధవారం రంగోలి, క్లాస్ రూమ్ డెకరేషన్, పాటలు, డాన్స్ పోటీలలో విజేతలకు ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ బి. శివ శిరీష , డైరెక్టర్ బి. భరత్ రెడ్డి పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ బహుమతిగా అందించారు. కరపలో గ్రామ సర్పంచ్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు పోటీల విజేతలకు, కురసాల సత్యనారాయణ, జడ్‌పిటిసి వై సుబ్బారావు ఎంపీపీ శ్రీలక్ష్మి బహుమతులు అందజేశారు. అట్లకట్ట గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణి ఆధ్వర్యంలో నిర్వ హించిన పోటీల విజేతలకు ఎస్ఐ రామకష్ణ బహుమతులు అందజేశారు. **పిఠాపురంలో** హార్వెస్ట్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థులతో డూడు బసవన్న, హరిదాసు వేషధారణ, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు కరస్పాం డెంట్ సత్యమోహన్ రెడ్డి చైతన్య బహుమతులు అందజేశారు ప్రిన్సిపాల్ అనిల్ రవీంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ...

కాకినాడ భానుగుడి 100 బిల్డింగ్ సెంటర్‌లో ప్రియా హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆవరణలో మేనేజింగ్ డైరెక్టర్ టి.పావని ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ ఏటా విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. పిన్సిపల్ టి.నరేంద్ర మాట్లాడుతూ తమ కళాశాలను స్థాపించిన నాటి నుంచి నేటివరకు దాదాపు 600 మంది విద్యార్థులకు ఉన్నత ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. కోలాటం నిర్వహించారు. ఆటపాటలతో సందడి చేశారు.



కాకినాడ ప్రియ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో సంక్రాంతి సంబరాలు



సామర్లకోటలో సంప్రదాయ నృత్యం చేస్తున్న ప్రతిభవిద్యార్థులు



కాకినాడ రూరల్ తిమ్మాపురం సంబరాల్లో పాల్గొన్న కురసాల సత్యనారాయణ



కరప ఫిజియోథెరపీ కళాశాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



కోలంక వింగ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



'ప్రజాశక్తి ' క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు

నిజాన్ని నిర్భయంగా రాసే పత్రిక 'ప్రజాశక్తి'

ప్రజాశక్తి - గండేపల్లి

నిజాన్ని నిర్భయంగా పార్టీలకతీతంగా వాస్తవాలను వెలుగు తీసే పత్రిక ప్రజాశక్తి అని ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు.. జగ్గంపేట క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎంఎల్ఎ చంటిబాబు పజాశక్తి క్యాలండర్‌ను ఆష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి చలగల దొర బాబు, జడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారుబాబు, గొల్లవిల్లి రామకృష్ణ, ప్రజాశక్తి విలేకరులు టి.రామచంద్రరావు, డి.వీరభద్రం పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

74వ భారత గణతంత్రదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాటు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కోర్టు హాలులో బుధవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 రిపబ్లిక్ డే సంద ర్భంగా స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో వేడుకల నిర్వహణకు చేపట్ట వలసిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ పెరేడ్ మైదానాన్ని, వేదికను, సాంప్రదాయ కవాతు దళాలను సిద్ధం చేయాలని పోలీస్ శాఖను కోరారు. అన్నివిధాలా ముందస్తు జాగ్రత్తలతో, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్కో అధికారులకు, మైదానంలో పరిశుభ్రత, తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేపట్టలాని జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. ఉద్యానవనశాఖ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్లు సమన్వయంతో వేదిక, గ్యాలరీలను పుష్పాలు, మొక్కలతో సుందరీకరించాలని కోరారు. వేడుకలలో వివిధ ప్రభుత్వ శాఖలు తమ తమ అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారంతో శకటాలను, స్టాళ్లను ప్రదర్శించాలని ఆదేశిం చారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అత్యవ సర, ప్రథమ చికిత్సా సేవలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో దేశ భక్తి పూరితమైన సాంస్కతిక కార్యక్రమాల ఏర్పాటు చేయాలని డిఇఒకు సూచంచారు. వేడుకలకు హాజరైయ్యే ప్రముఖులు, ఆహ్వానితులకు సముచిత ఆతిథ్యం, ఆహూతులకు కుర్చీలు, షామియానాలు ఏర్పాటు చేయాలని కాకినాడ ఆర్‌డిఒను ఆదేశించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాట్లను పర్యవేక్షించాలని, జిల్లా ప్రగతి సమాచారంతో ముఖ్యఅతిధి ప్రసంగ పత్రికలు సిద్ధం చేయాలని సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. గణతంత్రదినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులను సత్కరించేందుకు శాఖల వారీగా నిర్దేశిత ప్రతిపాదనలను ఈ నెల 16వ తేదీ లోపున సమర్పించాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయా లని కలెక్టర్ అధికారులను కోరారు. సమావేశంలో డిఆర్ఓ కె.శ్రీధరరెడ్డి, ఎఎస్‌పి బి.సత్యన్నారాయణ, కాకినాడ ఆర్‌డిఒ బి.వి.రమణ, డిపిఓ విక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మైనేని వెంకటరత్నం వర్ధంతి

ప్రజాశక్తి - కాకినాడ

యుటిఎఫ్ సంఘం అధికార పత్రిక ఐక్య ఉపాధ్యాయ పత్రిక తొలి సంపా దకుడు అమరజీవి మైనేని వెంకటరత్నం వర్ధంతి సభను విజవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, చక్రవర్తి కోరారు. అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జనవరి 12వ తేదీన మైనేని వర్ధంతి సభను నిర్వహిస్తున్నామన్నారు. యాసలపు సూర్యారావు భవన్ పెద్దాపురంలో గురువారం ఉదయం సాహిత్యాభిమానులు, ఉపాధ్యా యులు హాజరై నివాళులు అర్పించాలని పత్రిక కన్వీనర్ గిరిధర గోపాలరావు కోరారు. వివిధ సామాజిక అంశాలపై కవితలు పోటీ నిర్వహిస్తున్నామనని, విజేతలకు బహుమతులు 12న జరిగే సభలో అందజేయనున్నట్టు రాష్ట్ర కార్యదర్శి వర్మ తెలిపారు.

కార్టూ'నిజం'



అబ్బే.. కోడి పందేల నుంచి కాదు...
పండక్కి ప్రయివేటు బస్సెక్కి వస్తున్నాలే...


చిరు వ్యాపారులకు జగనన్న తోడు

-ఆరో విడతలో రూ. 16.90 కోట్ల రుణాలు

-కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి - కాకినాడ

జగనన్న తోడు పథకం చిరు వ్యాపారులకు నిజమైన తోడు అని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం ఆరో విడతలో చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంకుల నుంచి రూ.10 వేలు చొప్పున వడ్డీలేని రుణాలను బటన్ నొక్కి ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరం నుంచి ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శు క్లా, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో జగనన్న తోడు కింద ఇప్పటికే లబ్ధిపొంది విజయవంతంగా చిరు వ్యాపారాలు నిర్వహి స్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిం చారు. ముఖ్యమంత్రి బటన్‌నొక్కి వడ్డీలేని రుణాలను, వడ్డీ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీ, కలెక్టర్ అధికారులతో కలిసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల లబ్ధిదారులకు మెగా చెక్‌లు అందజేశారు. మహిళలు ప్రదర్శించిన వస్తు ఉత్పత్తులను పరిశీలించి స్వయంగా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ పథకాన్ని లబ్ధిదారులు నిలకడగా మంచి ఉపాధి పొందేందుకు ఈ రుణాలు ఉపయోగపడతాయని, అధిక వడ్డీలకు బయటి నుంచి రుణాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి తప్పింద న్నారు. సంప్రదాయ కళాకారులతో పాటు చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారుల ఆదాయా లను స్థిరీకరించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని వివరించారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జగనన్న తోడు పథకం ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 వేలు చొప్పున బ్యాంకుల నుంచి అందుతున్న వడ్డీ లేని రుణాలతో చిరు వ్యాపారులు, సంప్రదాయ వత్తిదారులకు ప్రయోజనం కలుగుతోందన్నారు. జగనన్న తోడు పథకం ద్వారా ఆరో విడతలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 10,995 మంది లబ్ధిదారులకు రూ. 10.99 కోట్లు, పట్టణ ప్రాంతాలకు చెందిన 5,906 మంది లబ్ధిదారు లకు రూ. 5.91 కోట్లు రుణాలు మంజూరైనట్లు తెలిపారు. అదే విధంగా రుణాలు తిరిగి చెల్లించిన 29,742 మంది లబ్ధిదారులకు రూ. 75 లక్షల వడ్డీ రీయింబర్స్ మొత్తాన్ని ఖాతాల్లో జమచేసినట్లు వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పథకాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్నవారు ఎవరైనా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, ఎల్‌డీఎం సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్, మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల లబ్ధిదారులు హాజరయ్యారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృతిక శుక్లా

3వ రోజుకు ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూని వర్శిటీ ఖో-ఖో టోర్నమెంట్‌లో బుధవారం జరిగిన పోటీలలో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, బెళగావిలోని రాణి చిణ్ణమ్మ యూనివర్శిటీ, కాకినాడలోని జెఎన్టియుకె యూనివర్శిటీ, చెన్నైలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీల జట్లు గెలుపొందినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.శ్యామ్ కుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ ఇంటర్వ్యూలకు 28 మంది హాజరు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీ ఆయా పోస్టుల భర్తీకి సంబంధించి బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ జె సీతారామా రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పెద్దాపురం ప్రాజెక్టు సిడిపిఒ జి.ఉష మాట్లాడుతూ పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలో 11 ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరగా రాయ భూపాల పట్నం, పులిమేరు, ఎర్రవరం గ్రామాల్లోని 3 ఖాళీ పోస్టులకు ఎవరూ దరఖాస్తు చేసుకో లేదన్నారు. మిగిలిన ఎనిమిది ఆయా పోస్టుల భర్తీకి సంబం ధించి 32 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో నలుగురు మినహా మిగిలిన 28 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. ఈ 28 మందికి ఆర్‌డిఒ సీతారామారావు, అడిషనల్ డీఎంహెచ్‌ఒ డాక్టర్ సరిత, ప్రాజెక్టు డైరెక్టర్ కె.ప్రవీణ, సిడిపిఒల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించా రన్నారు. ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను తర్వాత ప్రకటిస్తారన్నారు.

త్వరలో పిహెచ్‌సి భవనం ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో పిహెచ్‌సి నూతన భవన నిర్మాణం పూర్తి చేసుకుని ఆసుపత్రి త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం కానుందనిఎంపీపీ చలగళ్ళ దొరబాబు అన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారిణి సౌమ్య ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. అభివద్ధి కమిటీ చైర్మన్ చల్లగళ్ళ దొరబాబు నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు.వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రూత్తల లలిత, అగ్రికల్చర్ ఏవో సద్గురు మూర్తి, డాక్టర్ సౌమ్య మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మేలో అమృత్ ఉత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కేంద్ర మంత్రి పట్టాభివృద్ధి శాఖ, స్మార్ట్‌సిటీ మిషన్ ఆధ్వర్యంలో మే నెలలో అమృత్ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ఈ అంశంపై స్మార్ట్‌సిటీ మిషన్ డైరెక్టర్ పూనల్‌కుమార్ బుధవారం దేశంలోని వివిధ స్మార్ట్‌సిటీ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వ హించారు. అనంతరం కమిషనర్ రమేష్ వీటి వివరాలను వెల్లడించారు. స్మార్ట్ సిటీకి ఎంపికైన 100 నగరాల్లోను కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో పెద్ద ఎత్తున అమృత్ ఉత్సవాలు నిర్వహించాని నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగా సైక్లింగ్ పోటీలు, స్మార్ట్‌సిటీల్లోని ముఖ్యప్రాంతాలు సందర్శన, ర్యాలీ నిర్వహణ వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహక సమావేశంలో పలు ప్రతిపాదనలపై చర్చించామన్నారు. త్వరలోనే ఉత్సవాల నిర్వహణ తేదీలు, చేపట్టే కార్యక్రమాల వివరాలను ప్రకటిస్తామన్నారు. స్మార్ట్‌సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.

సౌమ్యకు రెండు బంగారు పతకాలు

ప్రజాశక్తి - పెద్దాపురం



బహుమతి అందుకుంటున్న సౌమ్య

స్థానిక పద్మనాభ కాలనీకి చెందిన గొల్ల సౌమ్య ఇంజినీరింగ్ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించింది. పెద్దా పురం మున్సిపాలిటీ పారిశుధ్య విభా గంలో కార్మికుడిగా పని చేస్తున్న గొల్ల సుబ్రహ్మణ్యం కుమార్తె అయిన సౌమ్య ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజ నీరింగ్ చదివి హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తోంది. 2020-21బ్యాచ్ కి చెందిన సౌమ్య ఇంజినీరింగ్ విభాగంలోని అన్ని గ్రూపులకు సంబంధించి టాపర్‌గా నిలిచి బంగారు పతకం సాధించింది. అలాగే అకడమిక్ ఇయర్ టాపర్‌గా మరో బంగారు పథకం సాధించింది. అంతే కాకుండా ప్రగతి ట్రస్ట్ నుండి ఉత్తమ విద్యార్థిగా నగదు బహుమతిని కూడా అందుకుంది. బుధవారం ప్రగతి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ప్రగతి కళాశాల చైర్మన్ కృష్ణారావు నుంచి సౌమ్య పతకాలను అందుకుంది.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతి

ప్రజాశక్తి - అంబాజీపేట



ఎ.చైతన్య కుమార్, ఎస్ఐ, అంబాజీపేట

సంక్రాంతి పండుగను ఏవిధమైన అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా సాంప్రదాయబద్ధంగా సంతోషంగా జరుపుకోవాలని అంబాజీపేట ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు సిఐ ప్రశాంత్ కుమార్ పర్యవేక్షణ ఉంటుందన్నారు. కోడిపందేలు, గుండాటలు, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఏవిధమైన అనుమతులు లేవన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. వాలంటీర్లు, సచివాలయ మహిళా పోలీసులు ద్వారా విస్తత ప్రచారం నిర్వహించి ఏవిధమైన అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చట్టపరమైన చర్యలు తీదుకుంటామన్నారు. సాంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

జీవనోపాధి మెరుగుదలకు కృషి

ప్రజాశక్తి -రాజోలు

ప్రతి డ్వాక్రా మహిళకు జీవనోపాధి మెరుగుదల కోసం కృషి చేయాలని అలాగే కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని రాజోలు మహిళ సమాఖ్య ఎపిఎం ఎస్తేర్ లీలా అన్నారు. మండలంలోని మహిళా సమాఖ్య భవనంలో గ్రామ సమాఖ్యల ప్రతినిధులకు వారి విధులు, బాధ్యతలుపై ఆన్లైన్లో శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజోలు మహిళ సమాఖ్య ఎపిఎం ఎస్తేర్ లీలా మాట్లాడుతూ డ్వాక్రాకు చెందిన గ్రామ సంఘాల ప్రతినిధులైన ప్రెసిడెంట్, సెక్రటరీల యొక్క విధులు, వారు అనుసరించవలసిన బాధ్యతలు, సంఘాల ఆవశ్యకత, వాటికి సేవలు వంటి వాటిపై శిక్షణ ఇచ్చారన్నారు. దీనికి సంబంధించి. ఈ కార్యక్రమంలో సిసిలు, మహిళ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి ఆధునికీకరణ కోసం ధర్నా

ప్రజాశక్తి -రామచంద్రపురం

ద్రాక్షారామ-రామచంద్రపురం మెయిన్ రోడ్ ను ఆధునికీకరించాలని స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ప్రతిపక్ష పార్టీలు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. టిడిపి ఇంఛార్జి రెడ్డి సుబ్రమణ్యం, జనసేన పార్టీ ఇంఛార్జి పోలిశెట్టి చంద్ర శేఖర్. సిపిఐ ఎంఎల్ నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు. వెంటపల్లి భీమశంకరం కార్య కర్తలతో కలసి ధర్నా నిర్వహించారు. గత ఐదేళ్లుగా పూర్తిగా పాడై ఉన్న ద్రాక్షారామ-రామచంద్రపురం రోడ్డు వెంటనే వేయాలని నినాదాలు చేశారు.ముందుగా పాదయాత్ర తలపెట్టిన నాయకులకు పోలీసు లు అనుమతి ఇవ్వక పోవడం తో తరువాత ఆర్ డిఒ కార్యాలయం లో వినతి పత్రం అందజేశారు.

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -మండపేట

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే మండలంలోని వెలగతోడులో కార్డన్ సెర్చ్ బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు నిర్వహించినట్లు మండపేట రూరల్ సిఐ శివ గణేష్ అన్నారు. పోలీసు బలగాలతో గ్రామంలో మోహరించారు. ఇంటింటా సోదాలు నిర్వహించి ద్విచక్రవాహన పత్రాలు, ఆధార్‌కార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 20 మోటార్ సైకిళ్లను అదుపులోనికి తీసుకున్నారు. సంబంధిత పత్రాలు చూపితే యజమానులకు వాటిని అప్పగిస్తామని చూపించకపోతే సీజ్ చేస్తామన్నారు. ఈ సెర్చ్ లో రూరల్, పట్టణ, రాయవరం ఎస్ఐలు శివ కష్ణ, అప్పారావు, సురేష్, ఎపిఎస్‌పి బెటాలియన్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సమైక్యతకు క్రీడలు దోహదం

ప్రజాశక్తి - పెద్దాపురం

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలు అనేక రాష్ట్రాలు, ప్రాంతాల నుండి పోటీలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థుల మధ్య ఒకరి భావాలు ఒకరు తెలుసుకోవడం ద్వారా జాతి సమైక్యత పెంపొందడానికి దోహద పడతాయని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. స్థానిక రామారావు పేటలోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో ఐదు రోజులపాటు జరిగే జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో భాగంగా మూడవరోజు బుధవారం కలెక్టర్ కత్తికా శుక్లా పాల్గొని క్రీడా పోటీలను తిలకించి, అన్ని రాష్ట్రాల నుండి ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులను ఆమె అభినందించారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించేందుకు పాఠశాల స్థాయిలోనే విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. ఈ సందర్భంగా సైరస్ సంస్థకు చెందిన లోహిత, దీక్షిత లు క్రీడాకారుల ప్రోత్సహిస్తూ కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, చీఫ్ రిఫరీ సూర్యారావు, అసిస్టెంట్ రిఫరీ వేణుగోపాల్, పాఠశాల అకడమిక్ కల్చరల్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయంలో కలెక్టర్ పరిశీలన

పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరం, స్పందన, వీడియో కాన్ఫరెన్స్ హాలు, భూ సేకరణ, రీ సర్వే రికార్డులు, పరిపాలన, సివిల్ సప్లయి తదితర విభాగాలను ఆమె పరిశీలించారు. ఆమె పాలనాపరమైన వివరాలను ఆర్‌డిఒ సీతారామారావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో వై.సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అమలాపురం ఎంపీ చింత అనురాధ

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి మల్లవరంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడిపూడి శివ నారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న 11వ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు రెండో రోజు హెూరా హెూరీగా జరిగాయి. లీగ్ దశలో జరుగుతున్న పోటీల్లో భాగంగా కాకినాడ జిల్లా పి. మల్లవరం జట్టు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానం జట్టు, విశాఖపట్నం జట్లు ఉత్తమ ప్రతిభను కనబరిచాయి. రెండో రోజు పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన అమలాపురం ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. సంక్రాంతి సందర్భంగా క్రీడలను నిర్వహిస్తున్న కుడుపూడి శివన్నారాయణను ఆమె అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ రిఫరీ బి. ప్రసాద్, స్టేట్ రిఫరీలు, వైకాపా నాయకులు మట్టపర్తి లోవరాజు, పంపన రామకష్ణ, ఎడ్ల కుటుంబరావు, బర్రె లక్ష్మీ నరసింహ రాజు, ముద్దన ప్రసాద్, పేర్ని ఆదినారాయణమూర్తి, పోతుల రత్నకుమారి, శివ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి -రామచంద్రపురం

పట్టణంలో రాజబాబునగర్ కి చెందిన గంపల విజయ శేఖర్ అలియాస్ పండు అధిక మోతాదులో మద్యం తాగి నిర్లక్ష్యంగా బైక్ నడుపుతున్నందున రామచంద్రపురం ఎస్ఐ డి.సురేష్ బాబు మంగళవారం అదుపులోనికి తీసుకున్నాడు. బుధవారం విజయ శేఖర్ అలియాస్ పండును రామచంద్రపురం కోర్టులో హాజరు పరిచారు. అతనికి ఎజెఎఫ్‌సిఎం కోర్ట్ మేజిస్ట్రేట్ ఆశీర్వాదం పాల్ 15 రోజులు జైలు శిక్ష, రూ. 500 జరిమానావిధిస్తూ తీర్పునిచ్చారు.

పలువురిపై కేసుల నమోదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం నుంచి చిలకపాడు రోడ్డులో కోకో తోటలో పేకాడుతున్న చిలకపాడుకు చెందిన నలుగురు వ్యక్తులను, సూర్యారావుపాలెంకు చెందిన ఒకరిన అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3050 నగదు, ఐదు బైకులు, మూడు సెల్ ఫోన్లు బుధవారం స్వాధీన పరుచుకున్నట్లు ఎస్ఐ కె రామారావు తెలిపారు. దీంతోపాటు చివటం లో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ. 1150నగదు, కోడి, ఒక కత్తిని స్వాధీన పరుచుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ 25 మంది వ్యక్తులను ఉండ్రాజవరం తహాశీల్దార్ జి. కనకరాజు ఎదుట పాత కేసులు కల్గిన వారిని బైండోవర్ చేయించారన్నారు. ఇప్పటి వరకు వందమంది పై బైండోవర్ కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. **ఐ.పోలవరం** పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం రాత్రి దాడులుచేసి 9 మందిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రాజేష్ బుధవారం తెలిపిన వివరాలివి.. మురమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో పేకాట శిబి రంపై ఐ.పోలవరం ఎస్ఐ, సిబ్బంది, క్రైం పార్టీ సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో 9మంది వ్యక్తులను అదుపులోకి వారి నుంచి రూ.77.820వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.వీరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏటి గట్టుపై స్కూల్ బస్సు బోల్తా

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మండలంలో శ్రీరాంపురం వద్ద బుధవారం ఏటిగట్టు పై మండపేటకు చెందిన ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు చెందిన స్కూలు బస్సు కాలవ వైపుకు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోరిమిలి నుంచి ఏటిగట్టుపై వస్తున్న స్కూలు బస్సు శ్రీరాంపురం వద్ద అదుపుతప్పి కాలువ వైపుకి బోల్తా పడింది. బస్సులో ఉన్న ముగ్గురు విద్యార్థులు, డ్రైవర్ ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. కాలువలోకి దూసుకు వెళ్లకుండా కొబ్బరి చెట్టు అడ్డు పడడంతో ఈ పెను ప్రమాదం తప్పింది .





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హేమంచంద్రారెడ్డి, జెఎన్‌టియు వీసీ ప్రసాదరాజు, విద్యార్థులకు నగదు పురస్కారం అందజేస్తున్న చైర్మన్ పరుచూరి

ఘనంగా ప్రగతి వార్షికోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలో ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా కళాశాల సాంస్కతిక విభాగం ఆధ్వర్యంలో ప్రిజం 2కె 23 సాంస్కతిక ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్‌సిహెచ్‌ఈ చైర్మన్, హేమ చంద్రారెడ్డి, అతిథులుగా జెన్‌టియుకె ఉపకులపతి జివిఆర్ ప్రసాద రాజులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ 4.0 క్లబ్స్, కో-కరిక్యులర్ క్లబ్స్, ఎక్స్ ట్రా కరిక్యులర్ క్లబ్స్, ఎంజీఎన్ సిఆర్‌ఈ క్లబ్స్ విద్యార్థులతో ముఖ్య అతిథి హేమచంద్రారెడ్డి ముఖాముఖి నిర్వహించి, విద్యార్థినీ, విద్యార్థుల పురోగతికి కాలేజీ ఎకడమిక్ కమిటీ సభ్యులు సమిష్టిగా కషి చేయాలని సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కష్ణారావు మాట్లాడుతూ, సీఎం జగన్ మోహన్ రెడ్డి సారధ్యంలో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి ప్రభుత్వ పథకాల వల్ల ఎంతో మంది విద్యార్థులు తమ ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు సాధిస్తున్నారని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా కె సత్యనారాయణ మాట్లాడుతూ, తన వార్షిక నివేదికలో విద్యా, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా, క్రీడా మరియు సామాజిక సేవ వంటి వివిధ రంగాలలో 2021-22లో కళాశాల సాధించిన విజయాలను వివరించారు. అనంతరం కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణా రావు మాతమూర్తి పరుచూరి కమలాంబ జ్ఞాపకార్థం 2016 నుంచి 20 అన్ని విభాగాలలోని ప్రథమ, ద్వితీయ అకడమిక్ టాపర్స్‌గా నిలిచిన బాలికలకు నగదు పురస్కారం అందజేశారు. వార్షికోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయ. కార్యక్రమంలో డైరెక్టర్ మేనేజ్ మెంట్ ఎంవి హరనాథబాబు, డైరెక్టర్ ఎస్.శంభుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, వైస్ ప్రిన్సిపాల్ జి.నరేష్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ వై జయబాబు, ప్రిజమ్ ప్రధాన కోఆర్డినేటర్లు కె.చక్రపాణి, కె.లక్ష్మి వివేక, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడుగురు కానిస్టేబుల్స్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీసు శాఖలో పనిచేస్తున్న ఏడుగురు కానిస్టేబుల్స్‌కు ఉద్యోగోన్నతి లభించింది. 15 ఏళ్లుగా కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న కడలి మధు, కడలి శ్రీనివాస్, కడలి మాధవ్, కోన సర్వేశ్వరరావు, నక్కా శ్రీనివాస్, దవులూరి హరనాథ్, కె.జగన్నాథంలకు స్పెషల్ గ్రేడ్ హెడ్ కానిస్టేబుల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పుదుచ్చేరి పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగోన్నతులు పొందిన వారికి పలువురు అభినందనలు తెలిపారు.

గడ్డిమందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

ఇటీవల గడ్డి ముందు తాగి కాకినాడ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కొత్తపల్లి గ్రామానికి చెందిన గోనుల శాంతికుమార్ బుధవారం మృతి చెంది నట్లు స్థానికులు తెలిపారు. కొంతకాలంగా మెరుగైన వైద్యం అంది స్తున్నప్పటికీ రోజురోజుకి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో బుధవారం మృతిచెందినట్టు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో కోళ్లు మృత్యువాత

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం కాండ్రకోట లోని గీతానగరంలో బుధవారం కుక్కలు దాడి చేసి సుమారు 20 కోళ్లను చంపేశాయి. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన గవరసాన రాజశేఖర్ మాట్లాడుతూ కుక్కలు పశువులపై కూడా దాడి చేస్తూ గాయపరుస్తున్నాయన్నారు. మోటార్ బైకులపై వెళ్లే వారిని తరుము తున్నాయని, చీకటి పడితే వీధుల్లో నడవడానికి ప్రజలు భయపడుతు న్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఈ కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

23న జాతీయస్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ

జనవరి 23న జాతీయస్థాయి చేతిరాత దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శి షేక్ మహబూబ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 5 సంవత్సరాల తరువాత అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ అండ్ క్యాలిగ్రఫీ ఇనిస్టిట్యూట్, ఆఫ్ ఇండియా గ్రాఫాలజీ అసోసియేషన్, హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ దేశవ్యాప్తంగా జాతీయస్థాయి హ్యాండ్‌రైటింగ్ పోటీలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలు ఒకటో తరగతి నుండి ఇంటర్ విద్యార్థుల వరకు అవకాశం ఉందని తెలిపారు. అందంగా రాయగలిగే ఆసక్తిగల డిగ్రీ, ఇంజనీరింగ్, టీచర్ ట్రైనింగ్ చేసే వారికి కూడా అవకాశం ఉందని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనగోరువారు ఆన్‌లైన్ ద్వారా ఇంటివద్దనే పరీక్ష రాసి వాట్సాప్ ద్వారా పంపించవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 8639414376, 9182200765 నెంబర్లలో రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించాలని హుస్సేన్ తెలిపారు. పోటీలలో విజేతలకు కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతులమీదుగా మెడల్స్, బహుమతులు అందిస్తామన్నారు.